## క్లుప్తంగా

### జిల్లా కార్యవర్గం ఎన్నిక

నిర్మల్‌టౌన్: తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం నిర్మల్ జిల్లా కమిటీని ఆదివారం సంఘ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఏలిశెట్టి సుదర్శన్, అధ్యక్షుడిగా చెనిగారపు నాగరాజు, ఉపాధ్యక్షుడిగా కదారి సాయినాథ్, ప్రధాన కార్యదర్శిగా మాధురి రాజు, సహాయ కార్యదర్శిగా జితేందర్, కోశాధికారిగా పిట్టల శ్రీలత, సలహాదారుగా సుధాకర్ స్వామి, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మణ్, మాధవి ఎన్నికయ్యారు.

### వృద్ధులకు సరుకులు పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

కుంటాల: ప్రధాని మోదీ జన్మదినం పురస్కరించుకొని బీజేపీ చేపట్టే సేవా కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆదేశాలనుసారం ఆదివారం మండలంలోని పెంచికల్‌పాడ్‌లో వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సాయి సూర్యవంశీపటేల్, రవీందర్ పటేల్, దిగంబర్ పటేల్, ప్రసాద్, దశరథ్, సూర్యకాంత్, లక్ష్మణ్, సంతోష్, వెంకటేష్, లోకేశ్, ఇందు తదితరులు పాల్గొన్నారు.

### హిందీ భాషా దినోత్సవం



టీచర్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

కుంటాల: మండలంలోని కల్లూరు కేజీబీవీలో ఆదివారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. దేశంలో హిందీ భాషకు ప్రత్యేక గుర్తింపు ఉందని హిందీ ఉపాధ్యాయురాలు రజిత పేర్కొన్నారు. హిందీ భాష కోసం కృషి చేసిన మహానుభావుడు రాజేంద్ర సింహ అని కొనియాడారు. అనంతరం హిందీ ఉపాధ్యాయురాలు రజితను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ సువర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

### ఆత్మగౌరవ సభకు తరలిరావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ముధోల్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో ఈ నెల 19న నిర్వహించే లంబాడాల ఆత్మగౌర సభను విజయవంతం చేయాలని తెలంగాణ గిరిజన శక్తి జిల్లా అధ్యక్షుడు రామ్‌నాథ్‌నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎడ్‌బిడ్ తండాలో చలో హైదరాబాద్ ఆత్మగౌరవ సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ లంబాడాలు, గిరిజనుల మధ్య గొడవలు సృష్టించేందుకు కొందరు యత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సురేశ్, దత్తు, రాజు, మురళి, పండిత్ తదితరులున్నారు.

### శాలువాల పండుగ



శాలువాలతో సన్మానించుకుంటున్న దోస్తులు

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం గ్రామ సమీపంలో వ్యవసాయక్షేత్రంలో ఆదివారం పలువురు మిత్రులు దోస్తుల పండుగ నిర్వహించారు. ఒకరికొకరు శాలువాలతో సన్మానించుకొని మిఠాయిలు తినిపించుకున్నారు. ఒకవైపు మహిళలు గాజుల పండుగ జరుపుకొంటుండగా పురుషులు శాలువాల పండుగ నిర్వహించుకుంటున్నారు.

### బాధిత కుటుంబానికి చేయూత



సాయం అందిస్తున్న మోహన్‌రావుపటేల్

ముధోల్: ప్రజలకు సేవ చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్‌రావుపటేల్ అన్నారు. మండలంలోని బోరిగాం గ్రామంలో లక్ష్మి ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న మోహన్‌రావుపటేల్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు, నిత్యావసర సరుకులు అందజేశారు. పేద ప్రజలకు ట్రస్ట్ అండగా ఉంటుందని మోహన్‌రావు పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ సుభాష్‌పటేల్, నాయకులు కిష్టయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశలు వర్షార్పణం..



పై చిత్రంలో కనిపిస్తున్నది తానూరు మండలం మొగ్లి గ్రామానికి చెందిన కల్గావే నాందేవ్. ఈ రైతు తనకున్న ఐదు ఎకరాల్లో సోయా పంట సాగు చేశాడు. మరో 25 రోజుల్లో పంట కోత దశకు చేరేది. కానీ భారీ వర్షాలకు వాగు సమీపంలో మూడు ఎకరాల్లో ఉన్న సోయా పంట దెబ్బతింది. చేనులోకి మొత్తం మట్టి కొట్టుకొచ్చింది. పెట్టుబడులకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని.. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. మండలంలో మెజార్టీ రైతులది ఇదే పరిస్థితి.



తానూరులో వరదతో దెబ్బతిన్న సోయా పంట

- వరదలకు దెబ్బతిన్న పంటలు
- దిగుబడులు వచ్చేలా లేవని ఆవేదన
- నష్టపరిహారం అందించాలని రైతుల వేడుకోలు

తానూరు: భూమిని నమ్ముకొని వ్యవసాయం చేసే రైతన్నలకు నష్టాలే దర్శనమిస్తున్నాయి. అయితే అతివృష్టి(భారీవర్షాలు), లేకుంటే అనావృష్టి(వర్షాల్లేమి)తో ఆశించిన దిగుబడులు రావడం లేదు. జిల్లాలో ఇటీవల కురిసిన భారీవర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. గోదావరి తీరప్రాంతంతోపాటు వాగులు, చెరువులు, కుంటలు, లోతట్టు ప్రాంతాల సమీపంలో సోయా, పత్తి పంటలు నీట మునిగి రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. అధికారులు సర్వే చేసి దెబ్బతిన్న పంటలకు సాయం అందించాలని వేడుకుంటున్నారు.

**జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల్లో సాగు..**

జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేశారు. 1.10 లక్షల ఎకరాల్లో సోయా, 1.30 లక్షల ఎకరాల్లో పత్తి, 1.30 లక్షల ఎకరాల్లో వరి, 15 వేల ఎకరాల్లో పెసర, మొక్కజొన్న, కంది, కూరగాయలను సాగుచేశారు. ఈసారి సకాలంలో వర్షాలు కురువడంతో రైతులు విత్తనాలు విత్తారు. పంటలు కూడా ఆశాజనకంగా కన్పించాయి. కానీ గత నెల రోజుల వ్యవధిలోనే మూడు సార్లు కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. చేన్లలో నీరు నిల్వడంతో మొక్కలు కుళ్లిపోయి ఆకుపచ్చ తెగుళ్ల సోకుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**12 వేల ఎకరాల్లో నష్టం..**

ఇటీవల కురిసిన భారీవర్షాలకు జిల్లావ్యాప్తంగా 12వేల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ తెలిపారు. గ్రామాల్లో పంట నష్టం వివరాలను రైతులతో కలిసి వ్యవసాయాధికారులు సేకరిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే 90శాతం సర్వే పూర్తయినట్లు పేర్కొన్నారు. రెండేళ్లుగా దిగుబడులు సరిగా లేక నష్టాల్లోనే మగ్గుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధిక వర్షాలతో పెట్టుబడులు కూడా పెరుగుతున్నాయి. పత్తికి పచ్చదోమ, మడత తెగులు, పండినల్లి సోకడంతో రైతులు పురుగుమందులు పిచికారీ చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.



మొగ్లి గ్రామంలో రోడ్డు దెబ్బతినడంతో మునిగిన పంటలు

**నష్టపరిహారం అందించాలి..**

తానూరు మండలంలోని బోల్సా, ఎల్వత్, మహాలింగి, జౌలా(బి), తొండాల, వాడవన, మొగ్లి, కోలూరు, హిప్నెల్లి, ఝరి(బి), ఖర్బాలా, దౌలతాబాద్, తానూరు, సింగన్‌గాం, నంద్‌గాం గ్రామాల్లో భారీ వర్షాల వరదలకు బాసర, ముధోల్, లోకేశ్వరం, దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాల్లో గోదావరి నది ఉధృతికి పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు. అధికారులు గ్రామాల్లో పంట నష్టం సర్వే నిర్వహించి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

### పరిహారం అందించాలి



వర్షాలకు దెబ్బతిన్న పంటలను గుర్తించి బాధిత రైతులకు పరిహారం అందించాలి. ఈ సారి కోలుకోలేని నష్టం జరిగింది. వరద పోటెత్తడంతో పలు చేన్లలోని మొక్కలు కుళ్లిపోయా యి. తెగులు సైతం సోకుతోంది. అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి పంటలు పరిశీలించి మాకు న్యాయం చేయాలి.

– లక్ష్మణ్, హిప్నెల్లి, మం.తానూరు

### గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నాం

భారీవర్షాలకు పంటల నష్టం వివరాలను తెలుసుకునేందుకు గ్రామాల వారీగా సర్వేలు నిర్వహిస్తున్నాం. వాగులు, గోదావరి నది పరివాహక ప్రాంతంలో పంట చేన్లలో నిలిచిన నీటిని బయటకు మళ్లించాలని ఏఈవోలు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. నష్టం వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చూస్తాం. సలహాల కోసం ఏఈవోలను సంప్రదించాలి.

– అంజిప్రసాద్, డీఏవో

### నిధులు మంజూరు చేయాలని వినతి

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బీజేపీ నాయకులు ఎంపీ నగేశ్‌ను కోరారు. ఆదివారం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రహరీ లేకపోవడంతో ఆవరణలోకి పశువులు వస్తున్నాయని.. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇందులో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, బీజేవైఎం మండలాధ్యక్షుడు రామగిరి రంజిత్‌కుమార్, నాయకులు రాపర్తి శ్రీనివాస్, శ్రీరాం తదితరులున్నారు.

### పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన మాఅమ్మ–నాన్న ఫౌండేషన్ చైర్మన్ మాదిరి ఆంజనేయులు తల్లి ఇటీవల మృతిచెందారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని భైంసా ప్రజాట్రస్టు చైర్మన్, బీజేపీ నాయకులు మోహన్‌రావు పటేల్ పరామర్శించారు. మాజీ ఎంపీపీ సుభాష్ పాటిల్, మాజీ వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ స్వామిగౌడ్, మాజీ సర్పంచ్ నర్సయ్య, నాయకులు మంద భాస్కర్, శ్రీనివాస్‌గౌడ్, పోశెట్టి, ముత్యంరెడ్డి, శంకర్ ఉన్నారు.

### ఆకాశంలో అద్భుతం!



లక్ష్మణచాంద: మండలకేంద్రంలో ఆదివారం ఆకాశంలో అద్భుతం చోటు చేసుకుంది. సంధ్యా సమయంలో వీర హనుమాన్ రూపం గగనంలో కనువిందు చేసింది. దీంతో పలువురు తమ ఫోన్లలో ఈ అపురూప దృశ్యాన్ని బంధించుకున్నారు.

# అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- పిడుగుపాటుతో మృతిచెందిన దంపతుల పిల్లలకు ఎమ్మెల్యే బొజ్జు పరామర్శ
- ఇందిరమ్మ ఇల్లు, సాయం అందిస్తామని హామీ



చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

పెంబి: ఇటీవల పిడుగుపాటుతో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు అండగా ఉంటామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు భరోసానిచ్చారు. ఇటీవల మండలంలోని గుమ్మెన ఎంగ్లాపూర్ శివారులో పత్తి చేనులో పిడుగుపాటుతో నాగాపూర్ గ్రామానికి చెందిన ఆలకుంట ఎల్లయ్య–లక్ష్మి దంపతులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఆదివారం ఎమ్మెల్యే బొజ్జు నాగాపూర్ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. దంపతుల బిడ్డలను అన్నివిధాల ఆదుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇల్లు కట్టించి ప్రకృతి విపత్తు సాయం కింద రూ.ఆరు లక్షల చొప్పున అందించి ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తక్షణ సాయం కింద రూ.10వేలను అందజేశారు.

అనంతరం మందపల్లి గ్రామంలో ఈజీఎస్ నిధులు రూ.12లక్షలతో చేపట్టే అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. పలువురి ఇళ్లను పరిశీలించి అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నీల్‌రెడ్డి, నాయకులు గుడిసె రమేశ్, సుంచు శంకర్, మహేందర్, రాజన్న, రవి, రమేశ్, భీంరావు, తదితరులు ఉన్నారు.

**ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ**

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం రాత్రి 11 గంటలకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల సమస్యలు తెలుసుకున్నారు. మందుల నిల్వలు, సిబ్బంది విధులు తదితర విషయాలపై ఆరా తీశారు. సమస్యలుంటే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కాగా, ఆదివారం ఉదయం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను డీఈవో భోజన్న మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. శాలువాతో సన్మానించారు. పాఠశాలల్లో నెలకొన్న పలు సమస్యలు ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

### ఉత్సవాలు సంప్రదాయంగా జరుపుకోవాలి

ఖానాపూర్: త్వరలో ప్రారంభమయ్యే ఆదివాసీ గుస్సాడీ ఉత్సవాలను మహిళలు సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని రాజ్‌గోండ్ సేవాసమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆత్రం రాజేశ్వర్, ఆత్రం భీంరావు కోరారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డీజే చప్పుళ్లు, సంప్రదాయేతర విధానాలకు దూరం ఉండాలన్నారు. దండారీ, కోలాటం, అకాడీ తదితర పద్ధతుల్లో సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు.

### కుంటాలలో భారీ వర్షం



కల్లూర్‌లో పత్తి చేనులో నిలిచిన వర్షపునీరు

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. పత్తి, సోయా పంట చేన్లలో వర్షపు నీరు నిలిచింది. చేతికొచ్చిన సోయాపంట దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షంతో కల్లూరు చెక్ డ్యాం ఎత్తిపోయడంతో జలకళ సంతరించుకుంది. 25.6 మి.మీ.వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ సాయికృష్ణ తెలిపారు.

# ‘ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకోం’



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

భైంసాటౌన్: నిరంతరం ముధోల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే పి.రామారావు పటేల్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్, సతీశ్వర్‌రావ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఆయన వర్గీయులపై మండిపడ్డారు. ఆలయాలను అభివృద్ధి చేశామని చెబుతున్న మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గంలో ఆలయాల నిర్మాణానికి ఆలయ కమిటీల నుంచి 10 నుంచి 20 శాతం వరకు డబ్బులను ప్రభుత్వానికి ఎందుకు కట్టించారో చెప్పాలని డిమాండ్ చేశారు. నిర్మల్ నియోజకవర్గంలో డబ్బులు చెల్లించకుండానే నిధులు ఎలా మంజూరయ్యాయని ప్రశ్నించారు. పదేళ్లలో బాసరను అభివృద్ధి చేయకపోవడంతోనే ప్రజలు ఆయన్ను ఓడించారన్నారు. ఏయే పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలో చేరే వారికి ఎమ్మెల్యే రామారావ్ పటేల్‌ను విమర్శించే స్థాయి లేదని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సాయినాథ్, మండల, పట్టణ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ‘కావేరి’ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ చక్రధారి

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆదివారం అప్పాల కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ అప్పాల చక్రధారి, సిబ్బంది పాల్గొని విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందించారు. అత్యధిక మంది స్కెబిస్(గోకుడు వ్యాధి), పలువురు రక్తహీనతతో బాధపడుతున్నారని డాక్టర్ తెలిపారు. అనంతరం ఆరోగ్య జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హన్మంతు, హెచ్‌ఎం గఫార్, ఫౌండేషన్ సభ్యులు దీపక్, రవి, అతీక్ తదితరులు ఉన్నారు.

# కూలీల్లేక ‘క్యూ’లో లారీలు



లోకేశ్వరం నుంచి నందిపేట్ వెళ్లే రోడ్డుపై రేషన్ బియ్యం లోడ్‌తో లారీలు



నగర్ శివారులోని గోదాం ఎదుట నిలిచిన లారీలు

లోకేశ్వరం: నిజామాబాద్ జిల్లా నుంచి తీసుకొచ్చిన రేషన్‌బియ్యాన్ని నిల్వచేసేందుకు లోకేశ్వరం మండలం నగర్ శివారులోని గోదాంల ఎదుట లారీలు పెద్దసంఖ్యలో క్యూ కట్టాయి. దీంతో లోకేశ్వరం నుంచి నిజామాబాద్ వెళ్లే ప్రయాణికులు లారీలను చూసి ఆశ్చర్యపోతున్నారు. బియ్యం సంచులను లారీల నుంచి అన్‌లోడింగ్ చేసేందుకు సరిపడా కూలీలు లేరు. దీంతో లారీలు ఇలా రోడ్డుపై వరుసలో నిలిచిపోయాయి.

### వాహనదారులు.. జర పైలం



లోకేశ్వరం: భారీ వర్షాలకు మండలంలోని రాయపూర్‌కాండ్లీ నుంచి ఎడ్‌బిడ్‌కు వెళ్లే మార్గంలో కల్వర్టు వద్ద రోడ్డు కొట్టుకుపోయి పెద్ద గుంత ఏర్పడింది. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ప్రమాదకర గుంత పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# అస్తవ్యస్తం.. పారిశుధ్య నిర్వహణ



గుజిరిగల్లి-పురాణాబజార్ మార్గంలో చెత్తాచెదారం



బ్రాహ్మణగల్లి వ్యాయామశాల, గీతాభవన్ మార్గంలో..

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొందరు ఇళ్ల మధ్యన ఖాళీ స్థలాల్లో.. మరికొందరు బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పడేస్తున్నారు. గుజిరిగల్లి, పురాణబజార్, గణేశ్‌నగర్, బ్రాహ్మణ్‌గల్లి, పులేనగర్, కోర్బాగల్లి తదితర కాలనీల్లో చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది సకాలంలో వాటిని తొలగించకపోవడంతో పందులు చేరి దుర్గంధమయంగా మారుతోంది. కొన్నిచోట్ల నీటి ట్యాంకులు సైతం శుభ్రం చేయకపోవడంతో, నాచు పట్టి అధ్వానంగా మారాయి. డ్రైయినేజీల్లో పూడిక తీయకపోవడంతో, చెత్త పేరుకుపోయి మురుగునీరంతా రోడ్లపై చేరుతోంది. అసలే వర్షాకాలం కావడంతో వ్యాధుల ముప్పు పొంచి ఉందని, మున్సిపల్ అధికారులు పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.



గణేశ్‌నగర్‌లో అపరిశుభ్రంగా నీటి ట్యాంకు

# ప్రభుత్వ కార్యాలయాలకు రక్షణేది?



ప్రహరీ లేని ప్రభుత్వ ఆసుపత్రి దుస్థితి



ప్రహరీ లేని ప్రభుత్వ జూనియర్ కళాశాల

- పశువులు, ఆకతాయిలకు అడ్డాగా భవనాలు
- ప్రహరీలు నిర్మించాలంటున్న స్థానికులు



కుభీర్‌లోని ప్రాథమిక పాఠశాల

కుభీర్: మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు రక్షణ కరువైంది. ప్రహరీలు లేకపోవడంతో కార్యాలయం పనివేళలు ముగిసిన తర్వాత ఆకతాయిలు, మూగజీవాలకు అడ్డాగా మారుతున్నాయి. పలు చోట్ల మందుబాబులు విందు చేసుకుంటూ సీసాలు పగులగొడుతున్నారు. బస్టాండ్‌తోపాటు, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ప్రైవేటు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. పలువురు ఫర్నీచర్ సైతం ఎత్తుకెళ్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు ప్రహరీలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

కుభీర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, ప్రాథమిక పాఠశాల, కేజీబీవీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్టాండ్, హరిజన వాడ పాఠశాల, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, దార్‌కుభీర్ ప్రాథమిక పాఠశాల, పల్సి తదితర చోట్ల పాఠశాలలకు ప్రహరీలు లేవు.

### ప్రతిపాదనలు పంపించాం

గతంలో ‘అమ్మ ఆదర్శ పాఠశాల’ కింద ప్రతిపాదనలు పంపించాం. కొన్ని పాఠశాలలకు ప్రహరీలు సైతం నిర్మించారు. కాని బిల్లులు రాకపోవడంతో మిగతా పాఠశాలల్లో పనులు ప్రారంభం కాలేదు. మిగిలిన శాఖల కార్యాలయాలకు ప్రభుత్వం అడిగితే ప్రతిపాదనలు పంపిస్తాం.

– సాగర్‌రెడ్డి, ఎంపీడీవో

### ఎల్‌వోసీ అందజేత

కడెం: మండలంలోని మద్దిపడగకు చెందిన తాటికంటి రమ్య కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. మెరుగైన వైద్యం కోసం ఆదివారం ఖానాపూర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మబొజ్జు రూ. ఐదు లక్షల ఎల్‌వోసీ అందజేశారు. భూషణ్, వెంకటేశ్, శ్రీనివాస్ తదితరులున్నారు.